# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ భారత్, న్యూజిలాండ్ దేశాల మధ్య సంబంధాలను 'వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుతూ ఇరుపక్షాలు నిర్ణయం తీసుకున్నాయి.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూజిలాండ్ పర్యటన ముగించుకుని భారత్‌కు తిరిగిపయనమయ్యారు.

❖ భారత్.. భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉండే రక్షణ బలగాలను నిర్మిస్తోందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

❖ వియత్నాంలో స్పీడ్‌బోట్ ప్రమాదంలో 15 మంది భారతీయులు మృతి చెందారు.

❖ దేశంలోని ఉత్తర, తూర్పు ప్రాంతాలలో రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది.

========================

భారత్, న్యూజిలాండ్ దేశాల మధ్య సంబంధాలను 'వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుతూ ఇరు పక్షాలు నిర్ణయం తీసుకున్నాయి. న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో ఈరోజు ఆక్లాండ్‌లో విస్తృతస్థాయి చర్చలు జరిపారు. వచ్చే ఐదేళ్లలో ఇరు దేశాల మధ్య వార్షిక ద్వైపాక్షిక వస్తు, సేవల వాణిజ్యాన్ని 35 వేల కోట్ల రూపాయలకు చేర్చాలని నిర్ణయించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర తీర రక్షణ సహకారాన్ని పెంపొందించుకోవడంతో పాటు, భారత నౌకాదళం - న్యూజిలాండ్ రక్షణ దళాల మధ్య ఒప్పందం కుదిరింది. పసిఫిక్ ప్రాంతంలో శాంతి భద్రతలను పర్యవేక్షించేందుకు, సమాచార మార్పిడిని వేగవంతం చేసేందుకు వీలుగా ప్రత్యేక 'మారిటైమ్ సెక్యూరిటీ డైలాగ్' ను ఏర్పాటు చేయడానికి ఇరు దేశాలు అంగీకరించాయి. రెండు దేశాల మధ్య సుదీర్ఘ కాలంగా ఉన్న చర్చలు ఫలించి.. 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' (FTA) ఖరారు కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ, లక్సన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామని, తద్వారా ఇరు దేశాల వ్యాపార, పారిశ్రామిక రంగాలకు భారీ లబ్ధి చేకూరుతుందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛా, పారదర్శకత, సంపద వృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. సమకాలీన ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఐక్యరాజ్య సమితిలో తక్షణమే సమూల సంస్కరణలు చేపట్టాలని భారత్, న్యూజిలాండ్ డిమాండ్ చేశాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల న్యూజిలాండ్ పర్యటన ముగించుకుని ఈరోజు భారత్‌కు తిరిగిపయనమయ్యారు. దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత భారత ప్రధానమంత్రి.. న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఇరు దేశాల ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేయడంలో ఈ పర్యటన కీలక మైలురాయిగా నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వియత్నాంలో ఈరోజు భారతీయ పర్యాటకులతో వెళ్తున్న స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది భారతీయులు మృతి చెంది ఉంటారని వియత్నాం మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. మరో 21 మందిని రక్షణ సిబ్బంది సురక్షితంగా కాపాడారు. మొత్తం 32 మంది భారతీయ పర్యాటకులు, నలుగురు సిబ్బందితో కూడిన స్పీడ్‌బోట్ 'ఫూ క్వోక్' ద్వీపంలో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. ప్రమాద తీవ్రత, బాధితుల పూర్తి వివరాలను సేకరిస్తున్నామని, స్థానిక ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించింది. ప్రస్తుతం ఘటనా స్థలంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వియత్నాంలోని 'ఫూ క్వోక్' ద్వీపం సమీపంలో భారతీయ పర్యాటకులతో ప్రయాణిస్తున్న స్పీడ్ బోట్ బోల్తా పడిన ఘోర ప్రమాదంపై ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. ఈ ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ.. వియత్నాం ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, హోచి మిన్ సిటీలోని కన్సులేట్ జనరల్ కార్యాలయం బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తున్నాయని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, న్యూజిలాండ్ దేశాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యానికి ప్రవాస భారతీయ సమాజమే అత్యంత ముఖ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. న్యూజిలాండ్ పర్యటనలో ఆయన ఈరోజు ఆక్లాండ్‌లో ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయుల సమ్మేళనంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో పాటు అక్కడి ప్రభుత్వ ప్రతినిధులు హాజరుకావడం.. ఇరు దేశాల బంధానికి బలమైన రాజకీయ మద్దతుకు నిదర్శనమని మోదీ పేర్కొన్నారు. న్యూజిలాండ్ ప్రభుత్వం తనకు అందించిన ఘన స్వాగతానికి, ఆతిథ్యానికి నరేంద్ర మోదీ ఆ దేశ ప్రధాని లక్సన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూజిలాండ్ ప్రధాని మాట్లాడుతూ.. భారత్‌ను తమ 'నమ్మకమైన మిత్రుడు'గా అభివర్ణించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్.. బలమైన, స్వయం సమృద్ధి, భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉండే రక్షణ బలగాలను నిర్మిస్తోందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకుంటూ సంప్రదాయ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. విశాఖపట్నంలో ఈరోజు ప్రాజెక్ట్ 17ఏ శ్రేణికి చెందిన ఆరో స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ `ఐఎన్ఎస్ మహేంద్రగిరి` నౌకను కేంద్రమంత్రి తూర్పు నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఆరు అత్యాధునిక యుద్ధనౌకలను నౌకాదళంలోకి చేర్చుకోవడం మన దేశ నౌక నిర్మాణ సామర్థ్యానికి, వేగంగా ఎదుగుతున్న రక్షణ పారిశ్రామిక రంగానికి నిదర్శనమన్నారు. `ఆత్మనిర్భర్ భారత్`కు ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఒక నిలువెత్తు సాక్ష్యమని, ఇందులో 75 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానాన్నే ఉపయోగించామని వెల్లడించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ ఒక నమ్మకమైన భాగస్వామిగా అవతరించిందన్నారు. ప్రకృతి విపత్తుల్లో, మానవతా సహాయం అందించడంలో భారత నౌకాదళం ఎల్లప్పుడూ ముందుంటుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యక్తిత్వ వికాసంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని.. యువతరం గ్రంథాలయాలతో అనుబంధాన్ని పెంచుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సూచించారు. న్యూఢిల్లీలో కొత్తగా ఏర్పాటు చేసిన `లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ పబ్లిక్ లైబ్రరీ`ని కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జయప్రకాశ్ నారాయణ్ దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. దేశాన్ని, ప్రజలను సమగ్రంగా అర్థం చేసుకోవడానికి పుస్తక పఠనం ఎంతో అవసరమన్నారు. ఆధునిక విద్యతో పాటు దేశ సంస్కృతి, విజ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి గ్రంథాలయాలు ఒక శక్తివంతమైన సాధనమన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

సమగ్ర, స్థిరమైన దేశాభివృద్ధికి స్వచ్ఛంద కుటుంబ నియంత్రణ, ఆరోగ్యకరమైన కుటుంబాలే పునాది అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా తెలిపారు. `ప్రపంచ జనాభా దినోత్సవం` సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం వేదికగా దేశ ప్రజలకు ఈరోజు పలు సూచనలు చేశారు. కాన్పుకు, కాన్పుకు మధ్య సరైన వ్యవధి ఉన్నప్పుడే.. కుటుంబాలు మరింత ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటాయని స్పష్టం చేశారు. నాణ్యమైన కుటుంబ నియంత్రణ సేవలు మాతృ, శిశు మరణాలను అరికట్టి వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచగలమని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని ఉత్తర, తూర్పు ప్రాంతాలలో రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. రానున్న రెండు రోజుల్లో ఈశాన్య భారతంలోని పలు ప్రాంతాల్లో 12 సెంటీమీటర్ల కంటే ఎక్కువ మొత్తంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో అసోం రాష్ట్రానికి వాతావరణ విభాగం `రెడ్ అలర్ట్` జారీ చేసింది. ప్రస్తుతం పసిఫిక్ మహా సముద్రంలో నెలకొన్న ఎల్ నినో (El Nino) పరిస్థితుల కారణంగా దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాల గమనం నెమ్మదించిందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

హైదరాబాద్‌ను దేశంలోనే ఒక ప్రధాన హైస్పీడ్ రైల్ హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక (ఐటీ) శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈరోజు జరిగిన రక్షణ, పారిశ్రామిక రంగ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నుంచి పుణె, చెన్నై, బెంగళూరు నగరాలను అనుసంధానిస్తూ.. బులెట్ రైలు కారిడార్లను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ఈ హైస్పీడ్ రైలు నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తే

ప్రయాణ సమయం భారీగా తగ్గడమే కాకుండా.. దక్షిణాదిలోని ప్రధాన ఆర్థిక కేంద్రాల మధ్య అనుసంధానత మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదు టీ-20 సిరీస్‌లో భాగంగా చివరి టీ-20 క్రికెట్ మ్యాచ్ ఇంగ్లాండ్‌లోని సౌథాంప్టన్ లో కొద్ది సేపటి క్రితం ప్రారంభమైంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ చేస్తున్న ఇంగ్లాండ్ కడపటి వార్తలు అందజేసరికి  వికెట్ నష్టపోయి 153 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =